క్లుప్తంగా

నియామకం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రజా సంస్కృతిక కేంద్రం(టీపీఎస్‌కే) రాష్ట్ర అధ్యక్షుడిగా భూపతి వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా కె.హిమబిందులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన టీపీఎస్‌కే మహాసభలో ఈ ఎన్నిక జరిగింది. అనంతరం భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజల్లో ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రచారం చేయాలని, ప్రజలను ఆటపాటలతో చైతన్య పరుస్తామని తెలిపారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులు

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట డివిజన్ ఓవైసీనగర్‌లో రూ.20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో దెబ్బతిన్న రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దాదాపు నియోజకవర్గంలో అన్ని కాలనీలు, బస్తీల్లో సీసీరోడ్లను వేయించామన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి కృషి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టిక ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం డివిజన్‌లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించి చిన్నారులకు అందుతున్న పౌష్టిక ఆహారాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆమె అంగన్‌వాడీ టీచర్లకు తెలిపారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని మానవహారం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో నివసిస్తూ దరఖాస్తు చేసుకున్న పేదలందరికీ డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. సుందరయ్య పార్కు వద్ద పట్టణ పేదల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మానవహారాన్ని నిర్వహించారు. సోమవారం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల లిస్టును మండల కేంద్రంలో ప్రకటించాలని వారు కోరారు. సీపీఎం ముషీరాబాద్‌జోన్ కార్యదర్శి ఎం.దశరథ్, పట్టణ పేదల సంక్షేమ సంఘం నాయకులు విజయ్‌కుమార్, కె.రమేష్, సైదులు, సుగుణ పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

ముషీరాబాద్: టీఎస్‌ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన సందర్భంగా సీఎం కేసీఆర్ చిత్రపటానికి ముషీరాబాద్ బస్‌డిపోలో ఆర్టీసీ కార్మికులు పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, డిపో మేనేజర్ టి.కిషన్‌రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌లతో పాటు పలు ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ (బీఆర్‌కేవీ అనుబంధం) సిసా నర్సింహ్మాగౌడ్ కార్మికులకు మిఠాయిలను పంచిపెట్టారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎ.సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉందానగర్ – జూకల్ రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి (35) రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుడి ఒంటిపైన తెలుపురంగు చొక్కా, నీలిరంగు ప్యాంటు ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌పాత్‌పై అనారోగ్యంతో..

కాచిగూడ: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఫుట్‌పాత్‌పై మృతిచెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై పి.రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడుకు చెందిన అన్నాదొరై (80) ఆరు నెలల క్రితం నగరానికి వచ్చి నింబోలిఅడ్డా ఫుట్‌పాత్‌పై బిక్షాటన చేస్తున్నాడు. కాగా సోమవారం సాయంత్రం నింబోలిఅడ్డా ఫుట్‌పాత్‌పై అనారోగ్యంతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఇందిరాపార్కును సందర్శించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఎమ్మెల్యే



పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్

ముషీరాబాద్: నగరంలోని ఇందిరాపార్కులో నెలకొన్న సమస్యలు పరిష్కరించి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పార్కులో నెలకొన్న స్త్రీ, పురుషుల టాయిలెట్స్ నిర్మాణంతో పాటు వాకింగ్‌ట్రాక్‌ను యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని సూచించారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఇందిరాపార్కులో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, జోనల్ కమిషనర్ రవికిరణ్, స్టీల్ బ్రిడ్జి ఈఈ గోపాల్, జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్, ఏఎంఓహెచ్. మైత్రేయి, మున్సిపల్ డీఈలతో కలిసి పార్కును సందర్శించారు.

- ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ సుధాకర్‌యాదవ్, వాకర్స్ సభ్యులు పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.
- పెండింగ్‌లో ఉన్న స్విమ్మింగ్‌పూల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించాలని వారు కోరారు.
- ఇందిరాపార్కులో అన్ని కనీస సౌకర్యాలు కల్పించి పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే, కమిషనర్ అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులను చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ ఎజెండా



బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: సీఎం కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బీఆర్‌ఎస్ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్ ఆధ్వర్యంలో నల్లకుంటకు చెందిన ఇర్ఫాణ సుల్తానా పలువురు మైనార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యకర్తలు, నాయకులకు బీఆర్‌ఎస్‌లో తగిన ప్రాధాన్యత లభిస్తుందన్నారు.

మైనార్టీ మహిళలకు గుర్తింపు లేదు..

- బీజేపీలో మైనార్టీ మహిళలకు గుర్తింపు లేదని ఇర్ఫాణ సుల్తానా బీజేపీని వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా ఆ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. నియోజకవర్గంలోని మైనార్టీ మహిళలను ఏకతాటిపైకి తీసుకొచ్చి వచ్చే ఎన్నికల్లో కాలేరు వెంకటేష్‌ను రెండోసారి ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేస్తానన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు గెల్వయ్య, గాలపల్లి శంకర్, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

సివరేజీ సమస్యలను పరిష్కరించాలి



అధికారులతో కలిసి సివరేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో నెలకొన్న సివరేజీ సమస్యను పరిష్కరించాలని డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అధికారులకు సూచించారు. డివిజన్‌లోని ఎల్లయ్యబస్తీ, పక్క, వీధిలో తరచూ డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సోమవారం వాటర్‌బోర్డు డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌లతో కలసి పర్యటించి సమస్యను పరిశీలించారు. తరచూ సివరేజీ సమస్య ఉత్పన్నం కావడానికి గల కారణాలను కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. వెంటనే సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆమె సూచించారు. బీజేపీ నగర యువనేత వినయ్‌కుమార్, జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్, జగన్, స్థానిక బస్తీవాసులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి అభినందనలు



ముషీరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డిని సోమవారం తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షులు గడప శ్రీహరి, నాయకులు శివరత్నం, చంద్రప్రకాష్, ముఠా గణేష్, మెట్టు వైకుంఠం, ఓంప్రకాష్, సీ.కే.శంకర్, శ్యామ్‌సుందర్, కొమురయ్య, అంబటి సుధాకర్, రాజ్‌కుమార్, తదితరులు ఆయన నివాసంలో కలిసి అభినందించారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ముషీరాబాద్: మత్స్యశాఖలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను తక్షణమే పర్మినెంట్ చేయాలని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి ఎస్.దాసులు డిమాండ్ చేశారు. సోమవారం శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌ముదిరాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మత్స్యశాఖలో గత కొన్నేళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారని వారి సర్వీసులను క్రమబద్ధీకరించకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తే వారి జీవితాలు బాగుపడతాయని కోరారు. సంఘం ఉపాధ్యక్షులు ఎం.కిరణ్, సీ.హెచ్.పూర్ణచందర్, కే.సీ.భవ్యశ్రీ, శ్రీకన్య తదితరులున్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం



చేనేత మహిళలను సత్కరించి, రాట్నం తిప్పుతున్న గీతామూర్తి

ముషీరాబాద్: పద్మశాలీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అతినగరం సుదేష్ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చేనేత కళాకారులను వినయ్‌కుమార్, సుదేష్‌లు శాలువాలతో సత్కరించారు. అనంతరం పద్మశాలీల ఆరాధ్య దైవం మార్కండేయస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దశరథ్, నేత శ్రీనివాస్, చంద్రమౌళి, జయరాజ్, ఉర్మిల, తిరుపతి, సతీష్, లక్ష్మీనారాయణ, బాలరాజు, బుజ్జి వెంకటేశ్వర్లు, పున్న సత్యనారాయణ, బింగి నవీన్, ఎయిర్‌టెల్ రాజు, రమేష్, బల్లా ప్రశాంత్ తదితరులున్నారు.

ఢిల్లీ రాజ్‌ఘాట్‌లో చేనేత ర్యాలీ..

ముషీరాబాద్: అఖిల భారత పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో ర్యాలీ నిర్వహించి చేనేత వస్త్రాల ప్రాధాన్యతను వివరించారు.

చేనేత రంగాభివృద్ధికి కృషి..

కాచిగూడ: చేనేత రంగ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. సోమవారం భాగ్యనగర్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దశరథలక్ష్మి ఆధ్వర్యంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని చేనేత మహిళలను అభినందించారు. చేనేత రంగానికి కేంద్ర ప్రభుత్వం 2023–24 సంవత్సరం బడ్జెట్‌లో రూ.4300 కోట్లు కేటాయించిందన్నారు. రుక్మిణి, పద్మ, సుశీల, రాజ్యలక్ష్మి, అనంతలక్ష్మి, రమాదేవి, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

భవిష్యత్తు చేనేత రంగానిదే..

చేనేత కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం పాటుపడుతోందని బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ అన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా అధ్వర్యంలో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేస్తున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

- సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ ద్వారా విద్యార్థులకు రూ.2లక్షల వరకు లోన్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామని దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డాక్టర్ అరుణ్ కుమార్, ఆలే భాస్కర్, వెంకటేష్, డాక్టర్ సమత తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగంపై కేంద్రం జీరో జీఎస్టీని ప్రకటించాలి..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చేనేత రంగంపై కేంద్ర ప్రభుత్వం జీరో జీఎస్టీ ప్రకటించాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు డిమాండ్ చేశారు. చేనేత వస్త్ర ఉత్పత్తులు ముడి సరుకులపై తక్షణమే జీఎస్టీని తొలగించి చేనేత రంగాన్ని కాపాడాలని కోరారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో చిక్కా దేవదాసు మాట్లాడుతూ.. దళితబంధు తరహాలో చేనేతబంధు ప్రవేశపెట్టి తక్షణమే రూ. 10 లక్షలు చేనేత కార్మికులకు ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. రాష్ట్ర బడ్జెట్‌లో వేయి కోట్లు కేటాయించాలన్నారు. హైదరాబాద్ అధ్యక్షులు కత్తుల సుదర్శన్‌రావు, నాయకులు రచ్చ శ్రీనివాస్, చక్రపాణి, నాగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ చర్యలు తీసుకుంటున్నారని బీఆర్‌ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ అన్నారు. సోమవారం రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లి ఈడబ్ల్యూఎస్ కామన్ బస్తీ తదితర బస్తీల్లో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈడబ్ల్యూఎస్ బస్తీలో డ్రైనేజీ, కలుషిత నీటి వల్ల ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారన్నారు. డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం కోసం రూ.20 లక్షలతో ప్రతిపాదనలు పెట్టామన్నారు. పనులను ప్రారంభించి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావులపాటి మోజస్, దామోదర్‌రెడ్డి, నితిన్, బస్తీ వాసులు మనీష్, మనోజ్, బాలయ్య తదితరులున్నారు.

హోంగార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తొలగించిన హోంగార్డులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఈ విషయమై హైకోర్టు ఆదేశాలు కూడా జారీ చేసిందని తెలంగాణ హోంగార్డ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సకినాల నారాయణ అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హోంగార్డ్స్ జేఏసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రసదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. హోంగార్డులందరినీ పర్మనెంట్ చేసి కారుణ్య నియామకాలను చేపట్టాలన్నారు. హోంగార్డులకు రిటైర్మెంట్‌ను 65 ఏళ్లకు పెంచాలన్నారు. హోంగార్డ్స్ జేఏసీ ఆల్ ఇండియా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, రాష్ట్ర నాయకులు చైతన్య, సత్యనారాయణ, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

'బీసీలను అవమానిస్తున్న కాంగ్రెస్'

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన స్క్రీనింగ్ కమిటీలో బీసీలకు స్థానం కల్పించకుండా బీసీలను అవమానించిందని తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షుడు ఏ.రాజేశ్వర్‌రావు ఆరోపించారు. సోమవారం బీసీ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ప్రకటించిన దాంట్లో బీసీ నేతలకు స్థానం కల్పించకపోవడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. 'జనాభాలో 56 శాతానికి పైగా ఉన్న బీసీలకు కాంగ్రెస్ పార్టీలో సరైన ప్రాతినిధ్యం కల్పించకుండా అవమానిస్తోందని తీవ్ర విమర్శలు చేశారు'. అన్ని కమిటీల్లో బీసీలకు 50 శాతం ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ, సీడబ్ల్యూసీ కమిటీల్లో, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం టికెట్లు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలను నిర్లక్ష్యం చేస్తే వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీసీలు కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని రాజేశ్వర్‌యాదవ్ హెచ్చరించారు. బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి రవిచారి, ఉపాధ్యక్షుడు కుమార్, రఘునాథ్, పూసల సత్యనారాయణ, నగేష్ తదితరులున్నారు.

స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్థానికత కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ న్యాయం చేయాలని జీవో 317 ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంత్రి సబితాఇంద్రారెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు సూపర్ న్యూమరీ పోస్టులను క్రియేట్ చేసి వారందరినీ తిరిగి స్థానిక జిల్లాలకు కేటాయించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు, కోశాధికారి వినోదరాణి, జస్సీరాణి, లక్ష్మీనారాయణ, రత్నమాల, సత్యనారాయణ తదితరులున్నారు.

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



గండిచెర్ల వెంకన్నగౌడ్‌ను సత్కరిస్తున్న బీసీ నేతలు

కాచిగూడ: జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు పెట్టాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెర్ల వెంకన్నగౌడ్ డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడిగా గండిచెర్ల వెంకన్నగౌడ్ ఎన్నికైన సందర్భంగా బీసీ సంఘాల ప్రతినిధులు పలువురు సోమవారం ఆయనను కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగాల్లో 50 శాతం రిజర్వేషన్లతో పాటు బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. దేశ జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. గాదగోని మహేష్, సూరగాని రాంబాబు, మాదగోని నరేందర్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సంకల్ప బలం ఉంటే అసాధ్యమేమీ లేదు



సమావేశంలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్‌తేజ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సంకల్ప బలం ఉంటే అసాధ్యమంటూ.. ఏమి లేదని ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. తెలంగాణ బాలోత్సవం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర వహించాలని సూచించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మనమందరం కారణజన్ములమని ఏదో ఒక కారణం చేత ఈ భూమ్మీదకు వచ్చామని విద్యార్థులకు తెలిపారు. తెలంగాణ బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి సోమన్న, ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్ర, సుజావతి, బుచ్చిరెడ్డి, సుశీల తదితరులున్నారు.

చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలి



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ముషీరాబాద్: చిన్నారులు దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించాలని కార్పొరేటర్ జి.రచనశ్రీ చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా చిన్నారులకు వ్యాక్సిన్ వేయించడంలో తల్లిదండ్రులు మరచిపోయిన, అవగాహన లేకపోయిన వారిని సర్వే ద్వారా గుర్తించి వ్యాక్సిన్ వేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సోమవారం కవాడిగూడ డివిజన్ భీమామైదాన్ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు డీబీఆర్ మిల్స్ హెల్త్ సెంటర్ డాక్టర్ అవంతి ఆధ్వర్యంలో వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, పరిమళ్‌కుమార్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సీ.మహేందర్‌బాబు, ఏ.ప్రభాకర్, సలంద్రి దిలీప్ యాదవ్, అనిల్‌కుమార్, బస్తీ అధ్యక్షులు శంకర్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి..

కాచిగూడ: చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమరమేష్‌యాదవ్ అన్నారు. సోమవారం కాచిగూడ ఇందిరానగర్‌లో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు పిల్లలకు వ్యాక్సిన్ వేశారు. డాక్టర్ పద్మజ, డాక్టర్ మనోజ్‌రెడ్డి, నర్సుబాయి, ఇందిర, రమాదేవి, సబిత, లావణ్య, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఐ ఇమ్యూనైజేషన్ ప్రత్యేక క్యాంప్..

నల్లకుంట: ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సు (ఐఎంఐ) 4.0తో రెండేళ్లలోపు చిన్నారుల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని తిలక్‌నగర్ యూపీహెచ్‌సీ సిబ్బంది చెప్పారు. యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్(యూఐపీ) ద్వారా ఏటా మూడు కోట్ల మంది గర్భిణీలు, 2.6 కోట్ల మంది చిన్నారులకు రక్షణ కల్పిస్తున్న అతి పెద్ద ఇమ్యూనైజేషన్ ఈ కార్యక్రమం. దేశ వ్యాప్తంగా ఇమ్యూనైజేషన్ స్పెషల్ డ్రైవ్‌ను వైద్యారోగ్య శాఖ అమలు చేస్తోందన్నారు. సోమవారం నల్లకుంట డివిజన్ సంజయ్‌నగర్‌లోని అంబేడ్కర్ శతాబ్దిభవన్‌లో తిలక్‌నగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఐఎంఐ ఇమ్యూనైజేషన్ ప్రత్యేక క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్‌ను సందర్శించిన కార్పొరేటర్ అమృత చిన్నారులకు ఇస్తున్న టీకా ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. ఈ టీకాతో పిల్లలు డిఫ్తీరియా, కోరింత దగ్గు, ధనుర్వాతం, పోలియో, క్షయ, హెపటైటీస్ హెమోఫిలస్ ఇన్ఫులెంజా రకం 'బి' లాంటి అంటువ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని వైద్య సిబ్బంది కార్పొరేటర్‌కు వివరించారు. యూపీహెచ్‌సీ పీహెచ్‌సీ డి.పద్మ, ఏఎన్‌ఎం జి.శోభారాణి, ఆశావర్కర్ లక్ష్మీబాయి, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, వసంత పాల్గొన్నారు.

ప్రజా సంఘాలు అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

ముషీరాబాద్: ప్రజా సంఘాలు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. సోమవారం ముషీరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో అంజుమన్ తాజీవానే చిరం, మర్కజి పంచ్ కమిటీలకు నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కమిటీ సభ్యులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ సన్మానించారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, వై.శ్రీనివాస్‌రావు, సబిల్ అహ్మద్, షరీఫ్ తదితరులున్నారు.

గద్దర్ మృతి సమాజానికి తీరని లోటు



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి

ముషీరాబాద్: ప్రజాగాయకుడు గద్దర్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ కమిటీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో బాకారంలో విప్లవ గాయకుడు మృతికి సంతాపంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఠా జైసింహ, షరీఫ్, రహీం, శంకర్‌గౌడ్, ప్రవీణ్, చాంద్ తదితరులున్నారు. ప్రజా గాయకుడు గద్దర్ భౌతికకాయానికి ఎల్‌బీ స్టేడియంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ నివాళులర్పించారు.



బాకారంలో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

అంబర్‌పేట: ప్రజా గాయకుడు గద్దర్ మరణం బడుగు బలహీన వర్గాలకు తీరని లోటని బీఆర్‌ఎస్ మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిరెడ్డి తెలిపారు. సోమవారం బాగ్‌అంబర్‌పేట రెడ్ బిల్డింగ్ చౌరస్తాలో గద్దర్ చిత్రపటానికి ఆమె నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ నాయకులు గిరిధర్‌గౌడ్, హబీబ్, శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో సోమవారం సుందరయ్య పార్కులో ప్రజా యుద్ధనౌక గద్దర్‌కు ఘనంగా నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రమేష్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డిలు మాట్లాడుతూ.. మన కలలను పెంపొందించడంలో గద్దర్‌చేసిన కృషి మరువలేనిదన్నారు. పార్కు మాజీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, శంకర్, స్కైలాబ్‌బాబు, రాఘవరెడ్డి తదితరులున్నారు.

ట్యాంక్‌బండ్‌పై గద్దర్ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేయాలి..

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ పేరుతో ట్యాంక్‌బండ్‌పై స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేసినప్పుడే ఆయనకు ఘనమైన నివాళి అవుతుందని తెలంగాణ బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడు గొడిశాల బక్కయ్య అన్నారు. కెనరా బ్యాంక్‌లో పనిచేసిన గద్దర్ ప్రజల కోసం తన పదవికి రాజీనామా చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య ప్రతినిధులు సోమవారం గద్దర్ మృతిపై రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. బక్కయ్య (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా), ఎస్.సదానంద్ (కెనరా బ్యాంక్), ఎస్.రాంమోహన్ (ఎస్‌బీఐ), రాజేష్ (హెచ్‌ఎస్‌బీసీ), దేవదాసు (యూబీఓఐ), అమర్‌నాథ్ (బ్యాంక్ ఆఫ్ ఇండియా) తదితరులున్నారు.